

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వార్త




# హరహర మహాదేవ.. శంభోశంకర











మహాశివరాత్రిని పురష్కరించుకుని జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. నెల్లూరులోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి, నవాబుపేట శివాలయం, వెంకటాచలం వద్ద అడవిలో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు తాడికి అదనపు క్యూ లైన్లు ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా అన్ని వసతులు ఏర్పాటుచేశారు. శివాలయాల్లో ఉత్సవవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఫోటోలు: నందా మాల్యాద్రి

## నేడు భక్తి గీతాలాపన పోటీలు

**నెల్లూరు ఫిబ్రవరి 18, ప్రభాతవార్త-వైద్యం** మహాశివరాత్రి పర్వదిన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నగరంలోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో భక్తి గీతాలాపన పోటీలు జరుపుతున్నట్లు సృజన సాంస్కృతిక సంస్ధ అధ్యక్షుడు దగ్గుపాటి.రాధాకృష్ణ శనివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏ వయస్సు వారైనా పాల్గొనవచ్చని, జూనియర్, సీనియర్ విభాగాలకు వేర్వేరుగా బహుమతులుంటాయని వెల్లడించారు. విజేతలకు విలువైన బహుమతులు, పోటీ దారులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. పూర్తి వివరాలకు 7893847709 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. పోటీల అనంతరం జరుగు సభా కార్యక్రమానికి వివిధ రంగాల ప్రముఖులు ప్రధాన అతిధులుగా విచ్చేస్తున్నారని ఆయన ఆ ప్రకటనలో తెలియచేశారు.

## శంభో.. శివ శంభో



**కోవూరు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రదాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో రుద్రాభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించడమే కాకుండా ప్రత్యేకంగా పూలతో ఆకట్టుకునే విధంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష రుద్రాక్షలు, 1600 రుద్రాక్షల పళ్లలో స్వామివారిని ప్రత్యేకంగా అభిషేకించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ఒక్కొక్క రుద్రాక్షను ఆలయ ప్రధాన అర్చకులు అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా శాంతినగర్‌కు చెందిన పి. మల్లికార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## మహాదేవుని స్మరణలో శివాలయాలు



**చేజర్ల ,ఫిబ్రవరి18ప్రభాతవార్త:** హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల జయజయ ధ్వానాల మధ్య శివాలయాలు మారుమ్రోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కోటితీర్థంలోని కోటేశ్వరాలయం, కాకివాయిలోని హంసరామాశ్రమం, తూర్పుకంభంపాడులోని నాగేశ్వరాలయం, చేజర్లలోని శివాలయం, ఆదూరుపల్లిలోని దాచూరమ్మగుడి, లింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి . ఉదయం నుంచి పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలను రంగురంగుల విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా అలంకరించారు. కొందరు భక్తులు ఉపవాసాలతో శివనామస్మరణతో జాగరణ చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు జరిగాయి. కోటితీర్థం శివాలయం పరుశురాముని ప్రతిష్ట కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు చేజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వారు వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆర్టీసివారు నెల్లూరు నుంచి ప్రత్యేక బస్సులు నిర్వహించారు. ఆలయపాలకమండలి చైర్మెన్ గోతం మాధవి, ఆత్మకూరు మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు గోతం వెంకటసుబ్బయ్య, కోటితీర్థం సర్పంచ్ గోతం సృజనలు శివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కోటేశ్వరాలయంలో 'ఆనం ' ప్రత్యేక పూజలు మహాశివరాత్రి సందర్భంగా కోటితీర్థంలో వేంచేసియున్న కోటేశ్వరస్వామి ఆలయాన్ని వెంకటగిరి శాసనసభ్యులు , ఉమ్మడిరాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం ఉదయానే్న ఆలయానికి చేరుకున్నారు. ఉభయకర్తలు ఆయనకు ఆలయమర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. శిథిలదశకు చేరుకున్న ఈ ఆలయానికి నిధులు ఇప్పించి పునర్నిర్మాణం చేపట్టిన ఘనత మీదేనని ఆనంకు గుర్తుచేశారు. ఆలయపూజారులు ప్రత్యేక పూజలు చేసి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. ఆనం వెంట చిత్తలూరు మాజీ సర్పంచ్ మోదేపల్లి పెంచలనాయుడు, వేలూరు కేశవచౌదరి, కొమ్మి పార్ధసారధి, దౌపాటి రవితేజ, పలు గ్రామాల నాయకులు ఉన్నారు.

## ఏఎస్‌పేట దర్గాను స్వాధీనం చేసుకున్న వక్ఫ్‌బోర్డ్



**అనుమసముద్రంపేట ,ఫిబ్రవరి18ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట రహమతాబాద్‌లోని ప్రనముఖ్య పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గా మాజీ పీఠాధిపతి హఫీజ్‌పాషా ఎదుర్కొంటున్న లైంగిక ఆరోపణల నేపథ్యంలో వక్ఫ్‌బోర్డ్ పీఠాధిపతి బాధ్యతలు నుండి హఫీజ్‌పాషాను తప్పిస్తూ ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్టేట్ వక్ ఫ్‌బోర్డ్ కమిటీ ఏఎస్‌పేటకు చేరుకొని దర్గా ఆస్తిపాస్తులను హఫీజ్‌పాషాకుమారుడు జునేద్ నుండి స్వాధీనపరుచుకున్నారు. దర్గాలో ఉన్న అద్దె రూములు, దుకాణాలు, హుండీలు తదితర వాటి వివరాలు రాసుకొని స్వాధీనపరచుకున్నారు. ఈసందర్భంగా స్టేట్ కమిటీ సభ్యుడు వక్ఫ్‌బోర్డు సెక్రటరీ హుసేన్ మాట్లాడుతూ రాష్ట్ర వక్ ఫ్‌బోర్డు అధికారులు ఆదేశాల మేరకు తాము ఇక్కడికి విచ్చేసి దర్గా ఆస్తిపాస్తులను స్వాధీనపరచుకొని దర్గా పాలన వ్యవహారాలను తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. అనంతరం రాష్ట్ర అధికారుల ఆదేశానుసారం ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని యధాప్రకారం భక్తులు దర్గాకు వచ్చి దర్శనాలు చేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో స్టేట్ వక్ఫ్‌బోర్డు డిప్యూటీ సెక్రటరీ నూర్‌సాహెబ్, నెల్లూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ షేక్ అహ్మద్‌బాష, కృష్ణజిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ఖాజామస్తాన్, ఒంగోలు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, ఇతర సిబ్బంది జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ షేక్ మీరా, వైస్‌చైర్మెన్ షౌకత్‌అలీ, జిల్లా కమిటీ సభ్యులు షాజహాన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇలాంటి ఘటనలు జరగకుండా సంగం సిఐ రవినాయక్ , ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. .

## కామాక్షితాయికి వెండిగంగాళం,బంగారు బొట్టు బహుకరణ



**బుచ్చి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయికి నెల్లూరుకి చెందిన ఏటుకూరు వెంకట జ్ఞాన మల్లేశ్వరశర్మ ధర్మపత్ని పద్మజా దంపతులు శ్రీవార్ల అభిషేకానికి ఒక కేజి ఐదు వందల యాభై తొమ్మిది గ్రాముల వెండి గంగాళం పాత్ర,ఒక గ్రాము ఎనిమిది వందల అరవై మిల్లీ గ్రాముల బంగారు బొట్టు శనివారం మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దేవస్ధాన కార్యనిర్వహణాధికారి జొల్లు వెంకటసుబ్బయ్య,కి అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు.దాతలను శేష వస్త్రంతో సత్కరించారు.

## సజ్జలకు రూరల్ పని తప్ప వేరే పని లేదా?



**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** షాడో ముఖ్యమంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని పనులు వదిలేసి నెల్లూరు రూరల్ పనే చూస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాటి వెంకటేశ్వర్లును అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారని, నేను అక్కడ వెళ్తే వెంకటేశ్వర్లు అక్కడ లేడన్నారు. అక్కడ నుంచి డీఎస్పీకి ఫోన్ చేశా, 24 గంటల్లో కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారని తెలిపారు. అదే కేసులో కాసేపట్లోనే జావీద్‌ని, మన్నేపల్లి రఘును కూడా అరెస్టు చేశారని వివరించారు. షాడో ముఖ్యమంత్రి సజ్జల చెప్పినట్లు పోలీసులు పని చేస్తున్నారని ఆరోపించారు. ముగ్గురిని దుర్మార్గంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లకుండా హైవేల్లో తిప్పారు. వారిని మానసికంగా ఇబ్బంది పెట్టాలని సాయంత్రం 6 నుంచి 11 గంటల వరకు అనేక పోలీసుస్టేషన్‌లకు తిప్పుతున్నారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. మీ వేధింపులకు నా వెనుక నడిచే నాయకులు, కార్యకర్తలు లెక్కచేయరు. ఆఖరుకు నా డ్రైవర్లు కూడా లెక్క చేయరని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. మీ జర్కులని ఎప్పుడో వీఆర్ కళాశాలలో చూసేశాం. మీకు ఇవి కొత్త, నాకు కాదని సజ్జల రామకృష్ణరెడ్డిని ఉద్దేశించి ఘాటుగా వాఖ్యలు చేశారు. కేసులో నాతో సహా 11 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని తెలిపారు. సజ్జల నా పేరు మాత్రమే పెట్టావ్, నేను రూరల్ నియోజకవర్గంలో ఉంటాను, నన్ను కూడా అరెస్టు చేసి తుపాకులతో తిప్పుతూ బెదిరించుకో నేను భయపడేదే లేదు.. బెదిరేది లేదు.. అని వ్యంగ్యంగా మాట్లాడారు. నన్ను అడ్డుకోవడం నీ తరం కాదు. గుర్తు పెట్టుకో, నా వెంట నడిచే వారిపై మీ ప్రతాపం ఎందుకు దమ్ముంటే నా మీద ప్రతాపం చూపించుకో అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సవాల్ విసిరారు.

## బెస్ట్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును అందజేసిన ధామస్ పీటర్



**నెలూ ్లరు,ఫిబ్రవరి18 ప్రభాతవార్త-విద్య:** హాకీ ఇండియా సౌజన్యంతో హాకీ ఆంధ్రా ఆద్వర్యంలో ఈనెల 15నుండి 26వరకు కాకినాడ జిల్లా క్రీడాప్రాదికార సంస్ధ క్రీడామైదానంలో నిర్వహిసు ్తన్న 13వ సీనియర్ మహిళా జాతీయహాకీ పోటీల్లో హాకీ నెల్లూరు డైరెక్టర్ , హాకీ ఆంధ్రప్రదేశ్ కోశాధికారి ధామస్ పీటర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కర్ణాటక,గోవా జట్లమద్య జరిగిన మ్యాచ్‌లో బెస్ట్ ప్లేయర్ అవార్డు కు ఎంపికైన కర్ణాటక జటుకు చెందిన చందనకు ఆయన ఉత్తమ ప్లేయర్ అవార్డును అందజేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతు హాకీ ఇండియా కార్యవర్గం ఆహ్వానం మేరకు తాను జాతీయ పోటీల్లో పాల్గొనటం జరిగిందని, ఈ పోటీలు మరింత ఉత్సాహంగా సాగేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మహాసభలు జయప్రదం చేయాలి



**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మహాసభలు మార్చి మాసం 5,6 తేదిలలో నెల్లూరులో జరుగుతున్నాయని జయప్రదం చేయాలని ఈ సంఘం నేతలు తెలిపారు. కావలి పట్టణ జనతాపేటలోని కార్యాలయంలో శనివారం రాష్ట్ర మహాసభల గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ, జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, సహ అధ్యక్షులు రాజేశ్వర్‌లు మాట్లాడారు. సంఘం సీనియర్ కార్యకర్తలను కలవడం జరిగిందన్నారు. ఎపియుయుఎస్ బలపర్చిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్ధి కె.బ్రహ్మానందంకు ప్రధమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నేతలు రాధయ్య, ప్రతాప్, వెంకట్‌రెడ్డి, రఘువర్ధన్, పేరయ్య, శ్రీనివాసులు, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టు చేయాల్సింది కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలని పోలీసులకు ఇంత నిర్లక్ష్యం ఎందుకు..?



**నెల్లూరు ఫిబ్రవరి 18, ప్రభాతవార్త-వైద్యం :** నా మీద దాడి చేసింది వారిలో ప్రథమ, ద్వితీయ వ్యక్తులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు గిరిధర్‌రెడ్డిలని అప్పుడే వారి అరెస్టు చేయాల్సిందిపోయి నాలుగు నెలల తరువాత ఇప్పుడు కూడా ఆయనను అరెస్టు చేయకుండా, ఇతరులను అరెస్టు చేయడం ఏమిటని తక్షణమే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలని అరెస్టు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి.కృష్ణ, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అల్లాబక్షులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో మాతంగి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమపై దాడి అక్టోబర్ 17న అల్లాబక్షుపై రూరల్ ఎమ్మెల్యే అనుచరులు దాడికి యత్నించారని, ఆ సమయంలో అల్లాబక్షుకు అండగా ఉన్నానని అక్టోబర్ 18 ఉదయం తొమ్మిది గంటల సమయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి అనుచరులు తనపై దాడి చేసి చంపబోయారని మాతంగి అన్నారు. పురుషోత్తం, మురారి, తాటి.వెంకటేశ్వర్లుతోపాటు దాదాపు 25 మంది తనపై దాడి చేశారని కృష్ణ ఆరోపించారు. దానికోసం వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని, అయితే ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దానితో తాను నేషనల్ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడం జరిగిందన్నారు. కమిషన్ నుంచి నోటీసులు వచ్చాకే పోలీసులు స్పదించడం జరిగిందన్నారు. మూడున్నరేళ్ళలో కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి టీడీపీ నాయకులపై ఎన్నో దాడులు, అరాచకాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని వెల్లడించారు. 105 రోజులు పూర్తయిన నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అబ్దుల్‌అజీజ్ మీడియా సమావేశం పెట్టి పోలీసులను ప్రశ్నిస్తే ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేయించారని విమర్శించారు. పోలీసులు 11 మంది నిందితులని చెపుతున్నారని, 11 మంది కాదని ఇంకా పదిమంది నిందితులు ఉన్నారన్నారు. తాటి.వెంకటేశ్వర్లును అరెస్టు చేసి హైవేపై తిప్పుతున్నారని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడని, దారికాచి నాపై దాడి చేసి నన్ను కారులో ఎక్కించుకుని దారి పొడవునా కొట్టుకుంటూ తీసుకెళ్ళినప్పుడు నీకు జాలి కలగలేదా శ్రీధర్‌రెడ్డి అని వారు ప్రశ్నించారు. మాపై దాడి చేసినందుకు వరిపై కేసు నమోదు చేశారని, దానిని శ్రీధర్‌రెడ్డి పార్టీని వీడినందుకు సజ్జల కేసులు బనాయిస్తున్నారని ప్రజలను నమ్మించాలని చూస్తున్నాడన్నారు. కేవలం రూరల్ నియోజకవర్గంలోనే కాదని, జిల్లాలో అందరకి శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు గురించి అందరికీ తెలుసన్నారు. టీడీపీ నాయకులే అజెండాగా చేసుకుని కోటంరెడ్డి దాడులు చేశారని మండిపడ్డారు. టీడీపీ నాయకులపై దాడి, హత్యలకు పాల్పడి టీడీపీలోకప వస్తానని చెబుతున్నాడని, ఆయనని టీడీపీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. శ్రీధర్‌రెడ్డి టీడీపీలోకి వస్తే మా భార్యబిడ్డలు రోడ్డుపైన పడే పరిస్థితి వస్తుందని వివరించారు. అబ్దుల్ పోరాటంతోనే ఇప్పుడు అరెస్టులు కొనసాగుతున్నాయన్నారు. తమపై దాడి జరిగి నాలుగు నెలలైందని ఇప్పటి వరకు పోలీసులు ఎందుకు కిమ్మనకుండా ఉన్నారో, అర్ధం కాలేదని అంటే ఆయన అప్పట్లో అధికార పార్టీలో కొనసాగుతున్నారని ఊరుకున్నారాని పోలీసు అధికారులను ప్రశ్నించారు, ఇప్పుడు కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి పార్టీ నుంచి బయటకు వచ్చారని ఇప్పుడు అరెస్టులు కొనసాగించడం పోలీసులు అధికార పార్టీకి అండగా ఉన్నారని అర్ధం చేసుకోవచ్చన్నారు. అసలు ముద్దాయిలను పక్కనపెట్టి మిగతా వారిని అరెస్టు చేస్తున్నారని, ప్రధాన ముద్దాయిలైన ఎమ్మెల్యే కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు గిరిధర్‌రెడ్డిలతోపాటు, మిగతా కార్పొరేటర్లను కూడా తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి సాభిర్‌ఖాన్, దత్తాత్రేయ, కప్పిర.రేవతి, అస్లామ్, వెంకటశేషు, ఇజ్రాయెల్, మారుతి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రిని అవమానించిన పోలీసులపై చర్యలు తీసుకోండి

**కందుకూరు,ఫిబ్రవరి18,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీమంత్రి,దళితనేత కెఎస్.జవహర్‌ను పోలీసులు అవమానించారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు.దళితుడు అనేనెపంతో మాజీమంత్రి అని చూడకుండా అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో కింద కుర్చోబెట్టడం హేయమైన చర్యని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర మెప్పు పొందడం కోసం ఒక దళితుడినిఅవమానించడం నేరమని ఇందుకు బాధ్యులైన సిఐ,డిఎస్పీలపై ఎసీ ్స,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మోషే డిమాండ్ చేశారు.

## ఘటిక సిద్దేశ్వరంలో పరమేశ్వరుడ్ని దర్శించుకున్న మాజీ ఎంపి మేకపాటి



**సీతారామపురం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పవిత్ర శైవ క్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరంలో ని పరమేశ్వరుడ్ని మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గోత్రనామాలతో స్వామివారికి పూజాకార్యక్రమాలు నిర్వహించి, వారిని స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే జడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి , మాజీ ఎంపి మేకపాటి దంపతులకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర ప్రజలందరు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మహాశివరాత్రి సందర్భంగా పరమేశ్వరుడ్ని పూజించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మాజీ జడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి దంపతులు రాష్ట్ర బిసి కార్పోరేషన్ డైరక్టర్ పి.సి అల్లూరురాజు, సిద్దేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా పలకరించి ముచ్చటించారు. అలాగే మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరుపతయ్య శీతారామపురంలోని అన్నదానం ఏర్పాటు చేశారు. ఈకార క్రమంలో బాలయాపల్లి సర్పంచ్ కల్లూరు వెంకటరెడ్డి, వైసిపి నాయకులు పాలకొలను వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి గోరంట్ల, తిరిపాలు, తదితరులు పాల్గోన్నారు.

## శివాలయంలో పెద్ద ఎత్తున అన్నదానం



**సంగం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబా తారకేశ్వరస్వామి వారి సన్నిధిలో మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకొని భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు . అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా గుండ్రా రఘురామిరెడ్డి, సుదర్శనమ్మ, పెనుమల్లి వెంకటరెడ్డి, సుదర్శనమ్మ జ్ఞాపకార్థం పెనుమల్లి శివ ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీ ప్రసూన, కుమార్తె శివప్రియ వ్యవహారించారు.

## భక్తులకు కాకర్ల ట్రస్టు సేవలు



**సీతారామపురం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని పోలంగారిపల్లి శివాలయానికి విచ్చేయు వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం, మజ్జిగ, త్రాగునీరు మరియు ప్రసాద వితరణ ఏర్పాటు చేసి అన్నదానం నకు విరాళంలను కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా ట్రస్టు వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ అందజేస్తున్నారు. అనంతరం సురేస్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయగిరి నియోజకర్గ ప్రజలందరికి మరియు రాష్ట్ర ప్రజలందరికి శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీసిద్దేశ్వర ఆలయానికి పోట్టేత్తిన భక్తులు



**ఉదయగిరి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని శివాలయాలలో శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. గండిపాలెం ప్రాజక్టు పైన వెలసియున్న శ్రీ సిద్దేశ్వరస్వామి వారి ఆలయనాకి భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఆలయంలో స్వామి వారిని జిఎంకె ట్రస్టు అధినేత మాలకొండయ్య చౌదరి పాముల రమణయ్య స్వామి వారిని దర్శించుకొని అక్కడ జరుగుతున్న కార క్రమాలకు తమ వంతు సహాయంగా లైటింగ్‌ను అన్నదానం ను అందించారు. దేవాలయానికి సంబందించి కొన్ని కొత్త గుడులు కట్టే క్రమంలో జిఎంకె ట్రస్టు అధినేత పాముల రమణయ్య అక్కడ కొన్ని కార్యక్రమాలు చేయిస్తు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తమ ట్రస్టు సభ్యుల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా జిఎంకె ట్రస్టు అధినేత మాట్లాడుతు స్వామి వారిని దర్శించుకొవడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే భవిష్యత్తులో స్వామి వారి ఆశీస్సులతో మరిన్ని కార్యక్రమాలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు.

## శివనామస్మరణతో మారుమ్రోగిన శివాలయం



**వింజమూరు ,ఫిబ్రవరి18ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వింజమూరులోని శ్రీగంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది . భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయాన్నే భక్తులు పూజా సామాగ్రితో ఆలయం చేరుకున్నారు . ఓం నమఃశివాయ అంటూ తమలోని భక్తిని వెల్లడించారు. శివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షతో రాత్రికి జాగరణ చేస్తే పరమేశ్వరుని కృప లభిస్తుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం. ఆలయంలోని వీరభద్రుడు, విజయగణపతి , బోళాశంకరుడు, అన న్నపూర్ణాదేవి, ఆలయం వెలుపల ఉన్న సుబ్రహ్మణ్యస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో కూడా భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయకమిటీ సభ్యులు పొన్నూరు ప్రకాశం అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. సాయంత్రం నిర్వహించిన కళ్యాణోత్సవానికి సూరం వీరభాస్కర్‌రెడ్డి-పద్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు తండోపతండాలుగా ఆలయానికి వచ్చి తిలకించారు.

## గుర్రప్పస్వామికి అభిషేక ఉత్సవం



**వింజమూరు, ఫిబ్రవరి18ప్రభాతవార్త:**వింజమూరులోని నడిమూరు ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ గుర్రప్పస్వామి , అంకాళమ్మ, నాగవరపమ్మ లకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . పర్యవేక్షకులు గడేసిన గురవారెడ్డి, అర్చకులు పసుపులేటి శివశంకరశర్మ బృందం ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపారు. ఈ అభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని , అమ్మవార్లను కనులారా దర్శించుకున్నారు. శివరాత్రి సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించి అర్చకులు పసుపులేని శివశంకరశర్మ శివరాత్రి మహత్యాన్ని భక్తులకు వివరించారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## నూతన అకాడమి కేంద్రం ప్రారంభం




**వింజమూరు, ఫిబ్రవరి18ప్రభాతవార్త:** వింజమూరులోని గాయత్రీనగర్‌లో ని దిమౌంట్‌ఫోర్ట్ పాఠశాల ఆవరణలో శనివారం శ్రీసుబ్రహ్మణ్య ఎడ్యుకేషనల్ అకాడమి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు వీలుగా శిక్షణాకేంద్రాన్ని ప్రారంభించారు . ఈకేంద్ర డైరెక్టర్ బి.సురేంద్రరాజు ఆధ్వర్యంలో ఎం.మాల్యాద్రిరెడ్డి ప్రిన్స్‌పాల్‌గా ఈకేంద్రం రూపుదిద్దుకుంది. ఈకేంద్రం గ్రామీణప్రాంతాల్లోని విద్యార్థులకు ఆసరాగా ఉంటుందని డైరెక్టర్ సురేంద్రరాజు పేర్కొన్నారు. తక్కువ ఫీజులతో నాణ్యమైన శిక్షణతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యనందిస్తారన్నారు. ఇంజనీరింగ్ ప్రవేశానికి అవసరమైన శిక్షణను ఇస్తారన్నారు. ఈఅకాడమిలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు తక్కువ సమయంలో వీలుంటుందన్నారు. గ్రామీణప్రాంత విద్యార్థులు వేలకువేలు ఖర్చుపెట్టి పట్టణ ప్రాంతాలకు వెళ్ళి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విద్యనభ్యసిస్తున్నారని ఇలాంటి వారందరికీ ఈ అకాడమి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరిబాబు, వారి మిత్రబృందం పాల్గొన్నారు.

## రుమ్రోగిన శైవక్షేత్రాలు



**కందుకూరు, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కందుకూరు డివిజన్‌లోని శైవక్షేత్రాల్లో శివనామస్మరణతో మారుమ్రోగాయి. వేకువజాము నుంచే శివదర్శనం కోసం భకు_లు బారులు తీరారు. పైగా శని త్రయోదశి కావడంతో శివాలయంలో ఉన్న నవగ్రహాలు కూడా ప్రత్యేక పూజలందుకున్నాయి. శనీశ్వరుణికి తైలాభిషేకం నిర్వహించారు. కందుకూరు పట్టణంలోని స్కందపురి సోమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో శనివారం మారుమ్రోగింది. శివాభిషేకాలు, దర్శనం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రివేళ ఘట్టాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి సలహాల మేరకు ఎం.వెంకట నరసింహారావు, ఈవో వి.రవికుమార్, కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, జలేంద్ర, ప్రసాద్‌రావు, భక్తులకు మంచినీటి ప్యాకెట్లు, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. సిఐ వెంకటరావు, ఎస్సై కిషోర్‌బాబు, పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అమిరిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 30మంది స్కౌట్ విద్యార్థులు భక్తులకు సదుపాయాలను ఏర్పాటు చేయడంలో సహకరించారు. లింగసముద్రంలో. లింగసముద్రం మండలం మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్మన్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. మండలకేంద్రమైన లింగసముద్రం తిరుమలశెట్టి కోటయ్య సమాది వద్ద శివరాత్రి సందర్భంగా గ్రామస్తులు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**ముత్తుకూరు, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో కైలాసనాదేశ్వర స్వామి ఆలయంలో తన తండ్రి కీర్తశేషులు మెట్ట చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం తన కుమారుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం నాడు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలలోని 5వేల మందికి భోజన ఏర్పాట్లనుఆయన దగ్గరుండి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కట్టా సుబ్రహ్మణం మాట్లాడుతూ వైసీపీమండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శివపార్వతుల కళ్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శనివారం భక్తులు క్యూలో నిలబడి శివ దర్శనం చేసుకున్నారు. శివనామస్మరణ హోరులో శివాలయాలు మునిగిపోయాయి. కావలి పట్టణంలోని శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం) ఆలయంలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పోలీస్ బందోబస్తు మధ్య భక్తులు క్యూ పద్ధతిలో శివయ్య దర్శనం చేసుకున్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్, వేదపండితులు ఎమ్మెల్యే దంపతుల్ని ఆశీర్వదించి సత్కరించారు. అలాగే కావలి వెంగళరావునగర్‌లోని పంచ ఋషీశ్వర క్షేత్రంలోని శివాలయంలో భక్తులు కిక్కిరిసిపోయారు. ప్రత్యేక క్యూలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కావలి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో వేంచేసి వున్న శ్రీ ఉమాదేవి సహిత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ ఆలయ నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ నేరెళ్ళ జ్వాలాసుబ్రమణ్యం భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అలాగే ముసునూరులోని శివాలయం, కావలి చెరువు వద్ద వున్న శివాలయాలలో భక్తులు పూజలు చేశారు.

## కావలి రైల్వే పట్టాలపై రైలు కింద పడి వ్యక్తి మృతి

**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కావలి రైల్వే స్టేషన్ ఉత్తరం చివరన డౌన్‌లైన్‌లో తాంబరం వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం వైద్యశాలకు తరలించారు. మృతుడు 35-40 సంవత్సరాల మధ్య వయసు వుంటుందని ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఆదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**ముత్తుకూరు, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** ఆదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా కృష్ణపట్నం గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఈవో జిజేరావు సా ్వమివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, అర్చకులు సీఈవోకి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివుని కరుణాకటాక్షాలు ప్రతిఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అతిపురాతనమైన కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో మహాశివరాత్రినాడు స్వామిని దర్శించుకోవడం ఆనందదాయకమన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటుచైయడమైంది. అలాగే రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మోహిత్ శకావత్, గంటా వేణుగోపాల్, గణేష్ శర్మ, కృష్ణపట్నం పోర్టు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష వాహనంపై శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి



**బుచ్చి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో వెలసియున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు కల్పవృక్ష వాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమీటి పర్యవేక్షించారు.

## కండలేరు గట్టున శివపార్వతుల కళ్యాణం



**మనుబోలు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** శివరాత్రిని పురస్కరించుకొని శనివారం కండలేరు గట్టున సంగమేశ్వర స్వామి సన్నిధి భక్తులతో పోటెత్తింది. శివరాత్రిని పండుగను పురస్కరించుకొని మనుబోలుకు చెందిన పచ్చిపాల రామిరెడ్డి, భార్గవి, పచ్చిపాల అవినాష్‌రెడ్డి, సంధ్య దంపతులు శివపార్వతుల కళ్యాణాన్ని జరిపించారు. అర్చకులు స్వామి వారి కళ్యాణాన్ని కనులపండుగగా జరిపించారు. భక్తులు స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించి పరవశులయ్యారు. టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం సంగమేశ్వర స్వామి దేవాలయంలో అష్టలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మనుబోలు నుండే కాకుండా గూడూరు లోతట్టు గ్రామాల నుండి ఈ దేవాలయానికి భక్తులు విచ్చేశారు. శివనామస్మరణతో సంగమేశ్వర సన్నిధి కండలేరు గట్టు మారుమోగింది. 2023 సంవత్సరాల క్రితం దశావతారాల్లో ఆరవ అవతారమైన పరుశరామ అవతారంలో పరుశురాముడు తన తల్లి హత్యపాతకం నుండి శాపవిమోచన కోసం దేశంలో పలుచోట్ల శివలింగాలు ప్రతిష్టించారు. మనుబోలుకు దక్షిణంగా కండలేరు గట్టున మూడు నదులు కలిసే చోట పరుశురాముడికి విమోచనం కలిగిందని పురాణాలు ఘోషిస్తున్నాయి.

## టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుని అడ్డుకోవడం దుర్మార్గం

### అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేతలు నిరసనలు



**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని అడ్డుకోవడం దుర్మార్గమని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరికలు చేశారు. చంద్రబాబును పోలీసులు అడ్డగించడాన్ని నిరసిస్తూ శనివారం కావలి పట్టణ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద మాలేపాటి నాయకత్వంలో నిరసన నినాదాల ప్రదర్శన జరిగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి అరాచకాలపై వినతి పత్రం వుంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లాలో పర్యటనలో వున్న చంద్రబాబునాయుడు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా అడుగడుగునా పోలీసులు అడ్డగించడం నియంత పాలనను గుర్తు చేస్తుందన్నారు. సైకో జగన్‌రెడ్డి పాలన పోవాలి, సైకిల్ పాలన రావాలని తెలిపారు. టిడిపి నేతల పాదయాత్రలు, రోడ్డుషోలకు వస్తున్న ప్రజాదరణ చూసి జగన్‌రెడ్డి వణికిపోతున్నాడన్నారు. అందువల్లే ఆటంకాలు సృష్టిస్తున్నాడన్నారు. వేలాది మంది పోలీసులను మోహరించి టిడిపి శ్రేణులను భయబ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. చంద్రబాబును ముందుకు కదలనీయకుండా పోలీసులు నేలపై కూర్చోని అడ్డుకోవడం దేశ చరిత్రలో ఎక్కడా చూడలేదన్నారు. పోలీసుల్ని బంట్రోతులుగా జగన్‌రెడ్డి వాడుకోవడం పట్ల మండిపడ్డారు. రౌడీమూకల పాలనలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ ప్రజలు దుయ్యబడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు



**బిట్రగుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివనామంతో మారుమోగాయి. మండలంలోని సోమేశ్వరపురం, జువ్వలదిన్నె పురాతన శైవ క్షేత్రాలతో పాటు నాగులవరంలో ఇటీవల శైవక్షేత్రంగా రూపుదిద్దుకున్న శ్రీ గంగా పార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగులవరం శైవక్షేత్రంలో రుద్రహోమం, కళ్యాణం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా బోగోలులోని కుమ్మరి వీధిలో స్వయంభుగా వెలిసిన శివాలయంలో శివపార్వతుల కళ్యాణం, రామస్వామిపాళెంలోని శివాలయంలో శివపార్వతుల కళ్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. పలుచోట్ల ఉపవాసం వున్న భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

## కొండాపురం మండలంలో భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు



**కొండాపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కొండాపురం మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాల్లో భక్తులు భక్తిశ్రద్దలతో స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కొండాపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. అలాగే స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో బ్రహ్మంగారి గోవిందమాంబ కళ్యాణం కనుల పండుగగా జరిగింది. జంగాలపల్లి, ఆదిమూర్తిపురం, సాయిపేట గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను విశేష అలంకరణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్ధప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ



**కావలి రూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా ఆధ్వర్యంలో శనివారం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కావలి కచ్చేరిమిట్టకు చెందిన విశ్రాంత తహశీల్దార్, హ్యాపీ సేవా సంస్థ గౌరవ సలహాదారు మొగల్ సిరాజ్‌బేగ్ తల్లి మొగల్ ఖతీజాబీ 4వ వర్ధంతి సందర్భంగా వారి నివాసంలో నిరుపేద మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మొగల్ సిరాజ్ బేగ్ మాట్లాడారు. తన తల్లి మొగల్ ఖతీజాబీ 4వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్ధం నిరుపేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేయడం సంతోషంగా వుందని తెలిపారు. ప్రతి ఒక్కరు జన్మనిచ్చిన వారిని మరువకుండా తల్లిదండ్రులను ప్రేమానురాగాలతో చూసుకోవాలని కోరారు. తనవంతుగా పేదలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా,విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జకావుల్లా, సిరాజ్‌బేగ్ సతీమణి సల్మా మొగల్, హఫీజ్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు



**కోవూరు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో లేగుంటపాడు ఎడ్ల బండ్ల సంఘం సహకారంతో శనివారం రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీలకు ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల నుంచి 36 ఎడ్ల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకులు, మంచి క్రీడాకారుడు తులసీరామ్‌రెడ్డిజ్ఞాపకార్థం బండ్ల సంఘం ఈపోటీలనునిర్వహించడం అభినందనీయమన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన పోటీలకు వేలాది మంది క్రీడాభిమానులు హాజరు కావడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇటువంటి పోటీలకు క్రమం తప్పకుండా నిర్వహించేలా నిర్వాహకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఈ పోటీలు జరగడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రగతి యువవకేంద్రం సీఈవో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి పోటీలను ఈ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గునుపాటి దయాకర్‌రెడ్డి, మహిళా బ్యాంకు సీఈవో ప్రసాద్‌రెడ్డి, గునుపాటి మిత్రరెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షుడు కోటిరెడ్డి, వివేకా యువజన సంఘం అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి , ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, నందగోపాల్‌రెడ్డి, అయ్యన్న, తదితరులు ఉన్నారు.

## వైభవంగా భవాని శంకర్ గ్రామోత్సవం



**ఇనమడుగు(కోవూరు),ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ భవాని శంకర్ స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఇనమడుగు పురవీధుల్లో అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మజ్జిగ చలివేంద్రం



**కోవూరు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్ ప్రాంతంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గమళ్లపాలెం యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ చలివేంద్రాన్ని పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పర్వదినం సందర్భంగా యూత్ ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్. నరసింహులురెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివాలయం చైర్మన్ సురేష్, నాగరాజు, జగదీష్‌స్వామి, సాయి యశ్వంత్‌రెడ్డి, శివకుమార్, వంశీ, రాజేష్, సుకుమార్, తదితరులు ఉన్నారు.

## భారీస్థాయిలో అన్నదానం



**కోవూరు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరులోని శివాలయ ప్రాంగణంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పుస్కరించుకుని హైదరాబాద్‌క చెందిన పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యలంఓ తన సతీమని అనసూయ జ్ఞాపకార్థం భారీస్థాయిలో అన్నదానం చేపట్టారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేకంగా అభిషేక పూజలు నిర్వహించి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల విజేత గంగపట్నం



**కోవూరు,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎడ్ల బండ్ల సంఘం ఆధ్వర్యంలో గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ పేరుపై నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం మూడు జిల్లాల నుంచి 30 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా .. ఐదు జట్లు విజేతలుగా నిలిచాయి.- విజేతలు వీరే..మొదటి బహుమతి ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామానికి చెందిన పంచాల మోక్షిత ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. వీరికి మొదటి బహుమతి కింద 20,116లు(గునుపాటి మిత్రా రెడ్డి), రెండవ బహుమతి బాపట్ల జిల్లా వంకాయపాలెంకు చెందిన ఎడ్ల జట్టు 15,116లు (దివంగత బట్టేపాటి వేణురెడ్డి), మూడవ బహుమతి పాటూరు పంచాయతీకి సంబంధించిన తూర్పు పల్లిపాలెం ఎడ్ల జట్టు 12,116లు ( దివంగత రామ్‌బ్రహ్మం) , నాల్గవ బహుమతి చెర్లోపాలెం గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయం ఎడ్ల జట్లు 9,116లు ( దువ్వూరు వెంకటేశ్వర్లు), ఐదవ బహుమతి గోల్కొండాయ తోపుకు చెందిన అభయాంజనేయం ఎడ్ల జట్టు , మహమ్మదాపురంక చెందిన శ్రీ ఆంజనేయం ఎడ్ల జట్టు 5116లు(ఎన్. జయరాజ్) అందజేశారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతితో పాటు గునుపాటి మిత్రారెడ్డి ఆధ్వర్యంలో వెండికప్పులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో గునుపాటి దయాకర్‌రెడ్డి, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, గునుపాటి భూపేష్‌రెడ్డి, గునుపాటి మనోజ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, సురేష్‌లతో పాటు ఎడ్ల బండ్ల సంఘం నిర్వాహకులు రమేష్, మురళి, దయాకర్, మునుస్వామి, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## పడమటి నాయుడుపల్లిలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

**మర్రిపాడు ,ఫిబ్రవరి18ప్రభాతవార్త:** మండలంలోని పడమటి నాయుడుపల్లి లో శివాలయం ధర్మకర్త జనార్ధన్ ఆధ్వర్యంలో శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. శివాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు .ఎస్ఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో కలిసి శివాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహజంచారు.ఆలయ అర్చకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

## గండిపాళెం పంచాయితీ సెక్రటరీకి పౌరసన్మానం




**ఉదయగిరి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో గండిపాళెం పంచాయితీ కార్యదర్శి అమర్‌నాద్‌రెడ్డికి జనవరి 26 న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులుగా ఉత్తమ పంచాయితీ సెక్రటరీగా అవార్డు అందుకున్న సందర్బంగా గండిపాళెం గ్రామ పెద్దలు అమర్‌నాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సన్మానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆయన సేవలు కొనియాడాతు ఆయనను ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య మాట్లాడుతుపంచాయితీ కార్యదర్శి అమర్‌నాద్‌రెడ్డి చేసిన సేవలకు తగిన గుర్తింపు వచ్చిందని ప్రతి ఒక్కరితో మమేకమై గ్రామాభివృద్ధికి పూర్తి స్దాయిలో కృషి చేశారని తెలిపారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన ఉదయగిరి వైస్ ఎంపిపి గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి మాట్లాడుతు గండిపాళెం నుండి మరిన్ని జీఎంకె ట్రస్టు ద్వారా సేవలు అందించడానికి తాము సిద్దంగా ఉన్నామని త్వరలోనే గండిపాళెంలో ఇంటర్‌మీడియట్ కాలేజిని నేర్మించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అలాగే గండిపాళెం బస్టాండ్ సెంటర్‌లో మరొక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి రాబోయే రోజులలో ప్రజల దాహర్తిని తీర్చేవిధంగా కృషి చేస్తామన్నారు.పంచాయితీ కార్యదర్శి అమర్‌నాద్‌రెడ్డి అవార్డు పొందడం అభినందనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ అమర్‌నాద్‌రెడ్డి మాట్లాడుతు నేను గండిపాళెం పంచాయితీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన తరువాత 4 అవార్డులు రావడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్బంగా గండిపాలెం గ్రామ పెద్దలకు ప్రత్యేకించి గుంటుపల్లి మాలకొండయ్య చౌదరికి ,పాముల రమణయ్యకి గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు అడుసుమల్లి వెంకటసుబ్బయ్య,రెడ్డిబత్తిన అంకయ్య,బల్లి అంకయ్య, ప్రెసిడెంట్ రాపల్లి భారతి,వైస్ ప్రెసిడెంట్ కల్పన మరియు సుబ్బారావు,బి వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాశివునికి అభిషేకాలు,పూజలు





**రాపూరు, ఫిబ్రవరి 18 ప్రబాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని శనివారం శ్రీ మహాశివునికి ప్రత్యేకంగా అభిషేకాలు పూజలు నిర్వహించారు. రాపూరులోని రామనాధేశ్వర స్వామి వారి ఆలయంలో ఉదయం స్వామి వారికి రుధ్రాభిషేకం, పంచామృతాభిషేకం, పాలు,పెరుగు,నెయ్యి, తేనే వంటి వాటితో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూలంగీ సేవ నిర్వహించారు. అనంతరం మద్యాహ్నంపెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులకళ్యాణం, వేదపండితులు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతర ప్రదోష కాల అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మంగారి జెండా ఊరేగింపు శివరాత్రి పర్వదినం సందర్భంగా రాపూరులోని బజారువీధిలో వున్న బ్రహ్మంగారి జెండ వద్ద నుండి స్వామి వారి గ్రామోత్సవం వేడకగా నిర్వహించారు. పెద్ద ఎత్తున యువత ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు





**రాపూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగిపోయాయి. ప్రధానంగా రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులో వున్న సిద్దిలేశ్వర కోన ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని స్వామి వారికి అభిషేకాలు,పూజలు నిర్వహించారు. అలాగే ఏపూరు గ్రామ సమీపంలోని మామిడి కోనలో స్వయంభువుగా వున్న మహాశివుని దర్శించుకోని పూజలు నిర్వహించారు.అకిలివలస గ్రామం సమీపంలో వున్న బుగ్గేశ్వర స్వామి వారి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏకాధశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన ఈ అబిషేకాలలో వైఎస్ఆర్‌సిపి ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, సంపూర్ణమ్మ దంపతులు, పెంచలకోన దేవస్థానం చైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి అనితా దంపతులు, సంక్రాంతిపల్లి సర్పంచ్ చెన్నుసంపూర్ణమ్మ తదితరులు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గోని పూజలు నిర్వహించి, అనంతర హోమంలో మహా పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్బంగా సామూహిక కుంకుమార్చాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మద్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకున్నారు.

## సిద్దేశ్వరస్వామి సేవలో కాకర్ల సురేష్



**ఉదయగిరి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండిపాళెం ప్రాజక్టు మీద వెలసియున్న శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరస్వామి వారి ఆలయాన్ని కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్త సురేస్ సందర్శించుకున్నారు.ఈ సందర్బంగా అక్కడికి వచ్చిన భక్తులందరికి అన్నదానం కార్యక్రమాన్ని కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించారు. అలాగే స్వామి వారి దేవాలయాన్ని ముందుముందు రోజులలో కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా మరింత అభివృద్ధిలోకి తేచ్చే విధంగా ట్రస్టు వ్యవస్దాపకులు కాకర్ల సురేష్ తెలిపారు.ఈ సందర్బంగా అక్కడికి వచ్చిన గ్రామ పెద్దలతో మాట్లాడుతు త్వరలోనే గండిపాళెం యువకులతో నాయకులతో ,గ్రామ పెద్దలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి గ్రామ అభ్యున్నతికి తోడ్పడతానని తెలిపారు. అనంతరం గండిపాళెం గ్రామ ప్రజలందరికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.శివరాత్రి సందర్బంగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా అన్ని సహాయసహకారాలు అందించిన కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్‌కి గండిపాళెం గ్రామ పెద్దలు స్వామి వారి ఆలయ మెంబర్లు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగ మహాశివరాత్రి వేడుకలు



జలదంకి,ఫిబ్రవరి18,ప్రభాతవార్తః మహాశివరాత్రి ఉత్సవాలు జలదంకిలో కన్నులపండుగగా జరుగుతున్నాయి.స్తానిక శ్రీగంగాపార్వతి సమేత జానకి రామలింగేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం ఉదయంనుంచే భక్తులు పోటెత్తారు.శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. మొక్కుబడులు, హోమాలు,బలిహరణ,గిన్నెబిక్ష,గ్రామోత్సవంటి స్వామికార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి సతీష్‌శర్మ శాస్రోక్తంగ నిర్వహించారు.అభిషేకాలతోపాటు విశేషపూజలుచేసి భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు.రాత్రివేళ ఏర్పాటుచేసిన సాంస్కృతికి కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈసందర్బంగ ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాలంకరణతో అలరాలింది.దేవాలయ ముఖద్వారంతోపాటు బజారులవెంట ఏర్పాటుచేసిన విద్యుత్‌కాంతులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన దేవతామూర్తుల కటౌట్లు అబ్బురపరచాయి.ఇలా ఒకటేమిటి గ్రామ వీధులలో ఒకదానినిమించి మరొకటి అన్నట్లుగ అలంకరణలు అచ్చెరువొందేటట్లు చేశారు.మండల సచివాలయ కన్వీనర్,మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి ఇందిర అన్నీతానై ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఆలయ ఉత్సవ కమిటి చైర్మన్ వాకా శ్రీనివాసులరెడ్డి,కమిటి సభ్యులు,గ్రామ పెద్దల సహకారంతో ఆమె నిర్వహించిన పాత్రను ప్రతివక్కరు ఎంతగానో కొనియాడారు.మూడు రోజులపాటు ఈఉత్సవాలను అత్యంవైభవంగా నిర్వహించేందుకు ఇందిరమ్మ ప్రత్యేక ఏర్పాట్లను చేసినతీరు గతంలో ఎవ్వరుకూడా చేయలేదని శ్లాఘిస్తుండడం గమనార్హం.విశ్వహిందూపరిషత్ భజరంగదళ్ జలదంకి మండలశాఖ భాధ్యులు దేవరపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి వారి బృందం నిర్వహించిన భక్తిపాటల మండలస్తాయి పోటీలు రసవత్తంగ సాగాయి.మండలంనుంచి పలుగ్రామాల భక్తులు ఈపోటీలలో పాల్గొని తమ గానామృతంతో ఆహుతులను ఉర్రూతలూగించారు.

## పడమటి నాయుడుపల్లిలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



**మర్రిపాడు ,ఫిబ్రవరి18ప్రభాతవార్త:** మండలంలోని పడమటి నాయుడుపల్లి లో శివాలయం ధర్మకర్త జనార్ధన్ ఆధ్వర్యంలో శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. శివాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు .ఎస్ఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో కలిసి శివాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహజంచారు.ఆలయ అర్చకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

## హర హర మహాదేవ అంటూ మారుమోగిన శివాలయాలు



**వెంకటాచలం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహా శివరాత్రి సందర్భంగా వెంకటాచలం మండలంలోని అడవిలో శివాలయం, సర్వేపల్లి శివాలయం, పూడిపర్తి, కాకుటూరు, కనుపూరు, కసుమూరు గ్రామాల్లో ప్రసిద్ధి గాంచిన శివాలయాలు శివనామ స్మరణలతో మారుమోగాయి. వేకువ జాము నుంచి భక్తులు స్నానాలాచరించి శివునికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అడవిలో శివాలయంలో అధిక సంఖ్యలో భక్తులు శివాలయాల వద్దకు చేరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ గంగాధర్, ఎస్ఐ అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేసి దర్శనం కల్పించారు. శివాలయాల్లో భక్తులకు అన్నదానం కార్యక్రమాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. నెల్లూరు నుంచి వచ్చిన ప్రత్యేక మహిళలు కోలాటాలు, అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు శివనామస్మరణలతో తమ పాటలుగా వినిపించారు. నెల్లూరు బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో అడవిలో శివాలయం వద్ద ప్రత్యేక శివలింగాన్ని ఏర్పాటు చేసి భక్తులకు పాలతో స్వయంగా పాలాభిషేకం నిర్వహించారు. శివుడు, దేవతామూర్తులకు సంబంధించి పుస్తకాలను భక్తులకు విక్రయించారు. ఈ సందర్భంగా అడవిలో శివాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మజ్జిగ, తాగునీరు, ప్రసాదాలు దాతలు విడి విడిగా పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ రామ్మూర్తి, కమిటీ సభ్యులు నాగిరెడ్డి, జగ్జీవన్‌రావు దగ్గరుండి భక్తులకు దర్శన ఏర్పాట్లను కల్పించారు.

## చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం దారుణం



**వెంకటాచలం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తూర్పు గోదావరి జిల్లాలో అడుగడుగునా చంద్రబాబునాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెంకటాచలంలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి జాతీయ రహదారిపై చొక్కాలు విప్పి అర్థనగ్న ప్రదర్శనలతో తమ నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. మండల అధ్యక్షులు రాజా యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు జనాలు వేలాది మందిగా ప్రజలు తరలిరావడంతో విశేష స్పందన రావడంతో ఓర్వలేక అధికార పార్టీ నాయకులు పోలీసుల ద్వారా చంద్రబాబునాయుడును అడ్డుకునేందుకు కుట్రలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేక రాక్షస పాలనలో ఉన్నామా అనేది అర్థం కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాజేంద్ర, చక్రధర్, మునుస్వామి, పఠాన్ ఖయ్యూమ్‌ఖాన్, రమేష్, మండల మణి తదితరులు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరుని సన్నిధిలో శివరాత్రి వేడుకలు



**సంగం ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన సంగంలోని రాజరాజేశ్వరీదేవి,కాశీవిశ్వేశ్వరస్వామి వారిసన్నిధిలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కాశీవిశ్వేశ్వరస్వామికి లింగోద్భవ కాల పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరానంద స్వామీ మాట్లాడుతు శివకేశవులు ఇద్దరు ఒకటేనని చెప్పారు.ఈ శివరాత్రి అత్యంత ప్రసిస్తమైనదని శనిత్రయోదశి,శివరాత్రి రెండు కలిసి వచ్చాయని ఆయన చెప్పారు.ఈకార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రఘురామయ్య కుటుంబసభ్యులు పూజా కార్యక్రమాలు ,స్వామి వారికి అభిషేకాలు చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దువ్వూరులోని కోటేశ్వరస్వామి వారి సన్నిధిలో, వంగల్లులోని భీమేశ్వరస్వామి సన్నిధిలో, మండలకేంద్రమైన సంగంలోని సంగమేశ్వరుని సన్నిధిలో, అన్నారెడ్డిపాళెం గ్రామంలో జ్ఞానప్రసూనాంబతారకేశ్వరస్వామి వారి సన్నిధి శివనామస్మరణతో మారు మ్రోగాయి.

## భక్తులతో పోటెత్తిన జొన్నవాడ మల్లికార్జునస్వామి సన్నిధి



**బుచ్చి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పురస్కరించుకొని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి భక్తులతో కిటకిటలాడింది.శ్రీమల్లికార్జునస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు అభిషేకాలు నిర్వహించారు.అలాగే మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు రాత్రికి వెండి రథోం ప్రాకారోత్సవంలు నిర్వహించారు. వెండి నందివాహనంపైన స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు . అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ,పాలక మండలి చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,పాలకమండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్,గుమ్మ రఘురామయ్య,తిరుమూరు సుప్రజ, ముంగర శివకుమార్, భక్తులకు సౌకర్యాలు కల్పించారు..రాత్రి 12 గంటలకు లిగోద్భవ కాల సమయంలో స్వామి వారికి వేదమంత్రోచ్చరణ మధ్య అభిషేకాలు నిర్వమించారు.అలాగే 120 సంవత్సరాల చరిత్ర కలిగిన బుచ్చిరెడ్డిపాళెంలోని శివాలయంలో కాశీవిశ్వేశ్వరునికి మహారుద్రాభిషేకం నిర్వహించారు.లిగోద్భవకాలపూజలు, పంచామృతాభిషేకాలు చేశారు.పెద్ద ఎత్తున మహిళలు ప్రజలు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఐక్యతతో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు ముందుకు వెళ్లాలి



**నెల్లూరుటౌన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఐకమత్యంతో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు ముందుకు వెళ్లాలని తద్వారా భవిష్యత్తు తరానికి మార్గదర్శకులుగా నడవాలని సంఘటిత పోరాటాలతోనే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా జనరల్ సెక్రటరీ జెల్లీ పద్మాకర్ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న యేనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల ఆత్మీయ అభినందన సభ, అనంతరం సమావేశం జరిగింది. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జెల్లీ పద్మాకర్ సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. అపరిష్కృతంగా ఉన్న తమ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే దిశగా తాము శక్తి వంతంగా కృషి చేస్తామని అన్నారు. నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బద్దెపూడి రవీంద్ర మాట్లాడుతూ పార్టీలకతీతంగా అసోసియేషన్ పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సంయుక్తంగా శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. బద్దెపూడి రవీంద్ర మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులందరికీ మార్కెట్ ధరకు ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బార్ కౌన్సిల్ సభ్యులకు సన్మానంతో పాటు మరి కొంతమంది సీనియర్ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు పలువురు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు ఎన్.వెంకయ్య, భాస్కర్, షేక్ కరిముల్లా, సద్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సిల్వర్‌ఓక్స్ వార్షిక క్రీడోత్సవం



**-విజేతలకు బహుమతులు అందజేసిన ఆర్డీఓ మలోలా**

**నెల్లూరు,ఫిబ్రవరి18 ప్రభాతవార్త-విద్య:** నగరంలోని స్థానిక పార్థసారధి నగర్ సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో గత రెండురోజులుగా నిర్వహించిన వార్షిక క్రీడోత్సవం ఎస్‌ఓక్స్ డే స్పోర్ట్స్ ఘనంగా ముగిసింది. వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నెల్లూరు ఆర్ ్డ ఓ మలోలా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పట్టు అవసరం అన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులు అన్నీ రంగాల్లో ఉత్సాహంగా ఉంటారన్నారు. నేటి యాంత్రిక జీవితంలో అలసిన దేహాలకు క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. చిన్నతనం నుండే క్రీడల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి స్పోర్ట్స్‌డేను నిర్వహించిన సిల్వర్‌ఓక్స్ యాజమాన్యాన్ని అయన అభినందించారు. పర్వతారోహకుడు సూర్యకుమార్ మాట్లాడుతు క్రీడల్లో పాల్గొనేవారికి శారీర రుగ్మతులు దరిచేరవన్నారు. అందరూ క్రీడలు, వ్యాయామాన్ని అలవరచుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్స్ షణ్ముఖ ఆచారి, వెంకటాద్రి లు మాట్లాడుతు తమ విద్యార్థులను చదువుతోపాటూ క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ స్పోర్ట్స్‌డేను నిర్వహిచంటం జరిగిందన్నారు. రెండురోజులపాటూ జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన అందరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుఖధా దాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం.... కమనీయం శివపార్వతుల కళ్యాణ వైభోగం



**బుచ్చి ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మంగళవాయిద్యాలు.ముత్యాలతలంబ్రాలు.వేదమంత్రోచ్చరణ నడుమ శివపార్వతుల కళ్యాణ అంగరంగ వైభవంగా నిర్వహించారు.బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద కొలువైవున్న శ్రీశ్రీశ్రీ దుర్గామల్లేశ్వరీ అమ్మో ్మరు తల్లి మహాశక్తి పీఠంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఈ కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట కనిగిరి రిజర్వాయర్‌లోని గంగాసహిత సుందరేశ్వరస్వామి వారికి విశేషమైన అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## శివనామస్మరణతో మారు మ్రోగిన శివాలయాలు



**కలువాయి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకించి శని త్రయోదశి రావడంతో మండలంలోని అన్ని గ్రామాలలోని శివాలయాలలో శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఇందులో భాగంగా కలువాయిలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయం నందు కుల్లూరులోని గంగాధరేశ్వర ఆలయ నందు ప్రత్యేక పూజలను నిర్వహించారు.వేకోజామున స్వామి వారికి రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు ఉభయకర్తల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. కలువాయిలోని శివాలయం నందు మధ్యాహ్నం శివభక్త మండలి ఆధ్వర్యంలో ప్రత్యే ఏడాదిలాగానే వేలాది మందికి అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.సాయి ంత్రం గ్రామ పుంవీదులలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నందివాహనంపై స్వామి వారి గ్రామోత్సవంలో పాల్గొని భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని భక్తులు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.అదే విధంగా ఆలయాలలో ప్రత్యేకించి లింగోద్భవ కాల పూజలను వేదపండితులు విశేషంగా నిర్వహించారు.కలువాయి శివాలయం నందు అర్చకులు నరసింహరావు స్వామి ఆధ్వర్యంలో శివభక్త మండలిసభ్యులు ఈకార్య క్రమాలు నిర్వహించారు.

## నా జోలికి వచ్చినా, వ్యక్తిగత ఆరోపణలు చేసినా తాట తీస్తా !

### టిడిపి నేత కుదవ వ్యాపారికి వైసిపి నేత కనమర్లపూడి హెచ్చరికలు



**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కావలి కుదవ వ్యాపార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కోట రమేష్ తన జోలికి వచ్చినా, వ్యక్తిగత ఆరోపణలు చేసినా తాట తీస్తానని కుదవ సంఘం పట్టణ అధ్యక్షుడు, వైసిపి నేత కనమర్లపూడి వెంకట నారాయణ తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. శనివారం కావలి వస్త్ర వ్యాపార కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కోట రమేష్ తనపై ఆరోపణలు చేశారన్నారు. ఆయన చేసిన ఆరోపణలు ఖండిస్తూ తమ సంఘం గౌరవాధ్యక్షుడు చక్కా సుబ్బారావు హెచ్చరికలు చేయడం జరిగిందన్నారు. ఆయన చేసిన ఆరోపణలపై కుదవ సంఘం నుంచి కమిటీ నిర్ణయం మేరకు సభ్యుడుగా తొలగించడం జరిగిందన్నారు. దీంతో ఆయన మీడియా సమావేశంలో తనపై వ్యక్తిగత ఆరోపణలకు దిగాడన్నారు. సభ్యుడుగా తిరిగి తీసుకోకపోతే తనకు సంబంధించి ఆరు పేజిల అవినీతి ఆరోపణల చిట్టా బయటపెడతానని హెచ్చరికలు చేశాడన్నారు. ఆయన చేసిన హెచ్చరికలకు సవాల్ చేస్తున్నానన్నారు. బెదిరిస్తే బెదిరేది లేదన్నారు. కరోనా సమయంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 3 లక్షల 50 వేల రూపాయలు వసూలు చేసి తమ అసోసియేషన్ ద్వారా పలు ప్రాంతాల్లో ఆహార పొట్లాలు, కిరణా సరుకులు, కూరగాయలు పంచి పెట్టడం జరిగిందన్నారు. కరోనా పేరుతో వసూలు చేసిన డబ్బుల్ని దుర్వినియోగం చేసిన వారు సర్వనాశనమైపోతారని కనమర్లపూడి తెలిపారు. ఈ కుదవ వ్యాపారి కోట రమేష్‌కు ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే దానిని చదివాడన్నారు. తాను మూడు సార్లుగా కౌన్సిలర్‌గా గెలిచి హ్యాట్రిక్ అనిపించానన్నారు. తాను అక్రమ లేఅవుట్లు, అక్రమ అపార్ట్‌మెంట్ నిర్మాణాలు చేస్తున్నానని ఆరోపించాడన్నారు. నా వ్యాపారాలకు సంబంధించి అలాంటి ఏవైనా వుంటే మున్సిపల్, నుడా అధికారులు చూసుకుంటారన్నారు. మీ నాయన కోట శంకర్‌రావు ఉద్యోగంలో ఎలా సంపాదించాడో తెలుసుకో అని హెచ్చరికలు చేశారు. జలదంకి మండలంలో మీ పొలాల బాగోతం బయటపెడతానని హెచ్చరికలు చేశారు. కోట రమేష్ జాగ్రత్తగా వుండకపోతే నీ అసలు గుట్టు రట్టు చేస్తానని కనమర్లపూడి తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. నీ వెనుక వుండి నీ చేత ఎవరు మాట్లాడిస్తున్నారో నాకు తెలుసునన్నారు. వారిని ఆ పరమేశ్వరుడే చూసుకుంటాడని శాపనార్థాలు పెట్టారు. నీ పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. కనమర్లపూడితో పెట్టుకుంటే నీ తాట తీస్తానని ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. తప్పులు చేసినట్లు అంగీకరించి కుదవ అసోసియేషన్‌కు లెటర్ ఇస్తే కమిటీలో పెట్టి ఆలోచించి నిన్ను తీసుకోవడమా లేదా అని నిర్ణయిస్తామన్నారు. నువ్వు లీగల్‌గా పోయినా ఇక్కడ భయపడేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో బంగారు అసోసియేషన్ అధ్యక్షులు నల్లూరు వెంకట రమేష్,గౌరవాధ్యక్షులు నల్లూరి రాము, కుదవ వ్యాపారస్తులు అమరా సుబ్బారావు, మహంకాళి శివకుమార్ ఆచారి, మువ్వల మల్లికార్జున, కనమర్లపూడి ప్రసాదరావు, పేరూరి లక్ష్మీనారాయణ, పొన్నూరి మల్లి, గొల్ల సుధాకర్, నాగాచారి, దింటకుర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంపై అఖిలపక్షం దశల వారి పోరాటం



**కావలి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కావలి పట్టణ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్షం పార్టీల నేతలు దశల వారి పోరాటం చేస్తున్నట్లు ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక నేతలు తెలిపారు. కావలి మున్సిపాల్టీ అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కావలి పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్ష పార్టీల వేదిక కన్వీనర్ కరవది భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నేత ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు, టిడిపి నేతలు జ్యోతిబాబురావు, దేవకుమార్, సిపియం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నేత కొప్పర్తి నాగరాజు, జనసేన నేత పొబ్బా సాయివిఠల్, సిపిఐయంయల్ నేత శ్యామల, ప్రజా కాంగ్రెస్ పార్టీ గోసల రవికాంత్, రిపబ్లిక్ పార్టీ పసుపులేటి మహేష్, మైనార్టీ నేత హఫీజ్‌లు పాల్గొని మాట్లాడారు. కావలి పట్టణంలో అధికారుల్ని మార్చినంత మాత్రాన అవినీతిపై విచారణ చేస్తారా అంటూ ఎమ్మెల్యేని ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, కరెంటు తదితర ప్రజల మౌలిక సమస్యలపై ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక దశల వారి పోరాటానికి కార్యాచరణను రూపొందించడం జరిగిందన్నారు. కావలి పట్టణంలో పారిశుధ్యం పడకేసిందన్నారు. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంలో మున్సిపాల్టీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బ్లీచింగ్ బదులు తెల్ల సున్నం కొట్టి సరిపెడుతున్నారన్నారు. దోమల నియంత్రణలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దోమల నిర్మూలనకు ఈ నాలుగేళ్లలో ఫాగింగ్ చేయలేదన్నారు. నేడు తూతూ మంత్రంగా అందులో కెమికల్ లేకుండా పొగ మాత్రమే వస్తుందన్నారు. పట్టణ ప్రజలను మభ్యపెట్టడం దారుణమన్నారు. పట్టణ శివారు ప్రాంతాలైన ముసునూరు, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, గిరిజన కాలనీలలో తాగునీరు అందడం లేదన్నారు. నీటి సరఫరా చేయకుండానే ట్యాంకర్లతో దొంగ బిల్లులు చేసుకుంటున్నారన్నారు. పట్టణంలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు. పందుల పెంపకందార్ల వద్ద ముడుపులు తీసుకొని వాటిని పట్టణంలో సంచరించేలా అనుమతులు ఇస్తున్నారన్నారు. ప్రధానకూడళ్లలో పందులు, కుక్కలు దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదలు, దళితులు నివసించే కాలనీల చుట్టూ రియల్టర్లు భారీ ప్రహరీలు నిర్మిస్తూ వున్నా కనీస చర్యలు లేవన్నారు. ఇందిరమ్మ కాలనీ చుట్టు భారీ ప్రహరీ నిర్మించడంతో నడిచేందుకు దారి లేకుండా పోయిందన్నారు. వెంటనే ప్రహరీలను తొలగించకపోతే తామే కూల్చుతామని హెచ్చరికలు చేశారు.మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డిని సెలవుపై పంపి అవినీతిని కప్పిపుచ్చాలని అధికార పార్టీ భావిస్తుందన్నారు. కావలి ఆర్డీవో శీనానాయక్ ప్రక్షాళన పక్కన పెట్టి సెలవుపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ అవినీతిపై విచారణ జరపాలన్నారు. కావలి మున్సిపాల్టీ అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ప్రజలు కలిసిరావాలని వారు పిలుపునిచ్చారు.

## ఆదాని వరల్డ్ స్కూల్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం



**ముత్తుకూరు,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** ఆదాని వరల్డ్ పాఠశాల అంటే కేవలం చదువు మాత్రమే కాకుండా ఇతర సృజనాత్మకత కార్యక్రమాలకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తుంది.అందులో ముఖ్యపాత్ర పోషించేవి క్రీడలు.చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ఇష్టమైన క్రీడలకు ఎంతో ప్రాముఖ్యతను వహిస్తూ ఆదాని వరల్డ్ స్కూల్‌లో శనివారం క్రీడాదినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.ఇందులో ప్రతి విద్యార్థినీ,విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.నర్సరీ,ప్రీ ప్రైమరీ విద్యార్థుల నృత్యాలతో అక్కడివారిని మరింత ఆకర్షణీయంగా మార్చారు.అనంతరం రెండు నెలలుగా నిర్వహించిన ఫుట్‌బాల్,డార్జిబాల్,పరుగుపందెం,క్రికెట్,షాట్‌పుట్ క్రీడలలో 1నుంచి 9వ తరగతి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగాపాల్గొని విజేతలుగా నిలిచారు.ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రితేష్ మోహిత్ పథకాలను,సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.